కథ

# హింసనచణ

ఓల్గా

"పది నెలలుగా పిల్చినట్టే ఈ పౌర్ణమికి కూడా మిమ్మల్ని వెన్నెలవిందుకు పిలుస్తున్నాను. వస్తారా? రారా?"

గాయత్రి గొంతు వినగానే గతుక్కుమనాన్ను. నా తడబాటు కప్పిపుచ్చుకుంటూ

"హలో- మీరా- బాగున్నారా- ఇవాళా- చూస్తాను. నాకేదో మీటింగున్నట్లుంది" అంటున్నాను.



"మీటింగెక్కడో చెప్పండి. నేనూ వస్తాను. అక్కడ్నించి మా ఇంటికి వెళ్దాం. లేదంటే నేనే మీ ఇంటికి వస్తాను. ఈ రోజు ఎలాగైనా మిమ్మల్ని కలవాలి. తప్పదు. ఇవాళ మీరు నన్ను తప్పించుకోలేరు. ఇవాళ నేను చాలా ఎక్సయిటెడ్‌గా ఉన్నాను. పోనీ నేనే మీ ఇంటికి వస్తాను. అడ్రస్ చెప్పండి".

గాయత్రిని మా ఇంట్లో ఊహించుకోలేకపోయాను. ఆవిడ కారంత ఉంటుంది మా డ్రాయింగ్ రూం. అదిగాక పెద్ద వంటిల్లు కమ్ భోజనాల గది. ఒక పడకగది, ఒక లైబ్రరీగది-అదే మా అమ్మాయి గది కూడా. ఇంటినిండా కిక్కిరిసిన పుస్తకాలు- బట్టలు.

మా ఇల్లు నీట్‌గా ఉండనందుకు నేనెప్పుడూ సిగ్గుపడలేదు. ఇప్పుడూ సిగ్గుపడదల్చుకోలేదు. కానీ గాయత్రిని ఇక్కడికి పిలవలేను. ఇదంతా ఒక నిమిషంలోనే ఆలోచించాను గానీ ఆ నిమిషంలోనే గాయత్రిలో అసహనం పెరిగింది.

"ఆశాలతగారూ అడ్రస్ చెప్పండి" మారాం చేస్తున్నట్టు అరిచింది.

"ఒద్దులెండి. నేనే వస్తాను" అన్నాను విసుగ్గా.

నా విసుగు చాలా స్పష్టంగా నా గొంతులో పలికింది గానీ గాయత్రి దానిని పట్టించుకోని ఉత్సాహంతో-

"నిజంగా వస్తారా? కారు పంపిస్తాను. ఎక్కడికి పంపను?"

"యూనివర్సిటీకి సాయంత్రం ఆరు గంటలకు పంపండి. సైకాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఉంటాను".

"అలాగే- మీరొచ్చేసరికి గంట పట్టొచ్చు. ఎనిమిదింటికి భోజనం చేద్దాం. పదింటి వరకూ మీతో మాట్లాడాలి".

"నేను తొమ్మిదింటికి భోజనం చేస్తాను. భోజనం చేయగానే బయల్దేరతాను మాటలన్నీ తొమ్మిదింటి లోపలే" కచ్చితంగా చెప్పాను.

గాయత్రి సంతోషంతో పెద్దగా నవ్వింది.

"అలాగే. రెండు గంటలు చాలు. మీరు వస్తున్నారు. అంతే చాలు. మీరు వెజ్ ఆర్ నాన్ వెజ్.

"పూర్తి నాన్ వెజ్"

"మిమ్మల్ని చూస్తే అలా అనిపించరే" వింత ఆశ్చర్యం గాయత్రి గొంతులో.

"ఎలా అనిపిస్తాను?"

"మాంసం తినని- అదే- బ్రాహ్మల్లా అనిపిస్తారు".

నాకు వాయించటానికి సందు దొరికింది.

"మొదటి విషయం బ్రాహ్మలు మాంసం తినరనేది ఒక భ్రమ. చాలా మంది తింటారు. వేద కాలంలో అందరూ తినే వారని అంటారు. రెండో విషయం తెల్లగా ఉన్నవాళ్ళంతా బ్రాహ్మలు కాదు. నా కులం మాదిగ. ఇప్పుడు కూడా మీ ఇంటి విందుకు ఆహ్వానం ఉందా?" అవతలి వైపు నుంచి ఒక్క క్షణం నిశ్శబ్దం. తర్వాత పెద్ద నవ్వు.

"తప్పకుండా ఉంది. రండి. రండి".

నేను ఫోన్ పెట్టేశాను.

"ఏంటి- ఎవరికి నీ కులం గురించి అంత గట్టిగా చెబుతున్నావు?" అంటూ వచ్చాడు రెహమాన్.

"గాయత్రి- అదే విశ్వేశ్వర్రావు భార్య. పది నెలల నుంచి డిన్నర్‌కి రండో అని చంపుతోంది. చివరికివాళ నేను రాకపోతే తనే వస్తానంది. అందుకని వస్తానని చెప్పాను. సాయంత్రం నువ్వు పెందలాడే వచ్చి వంట చెయ్యాలి. దీప్తి పొద్దున్నే వెళ్ళింది. Sports day అట" అంటూ నేను వంటింట్లోకి వెళ్తే నా వెనకాలే రహమాన్ వచ్చాడు.

"నీకేమో ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర్రావింట్లో విందు భోజనమా? ఇక్కడ నేను ఇంట్లో వంట చేసుకుతినాలా. నో- దీప్తీ నేనూ పారడైజ్‌కెళ్ళి బిర్యాని తింటాం".

"ప్లీజ్ ఒద్దు. ఆ బిర్యానీలు తినటం మంచిది కాదు రాహూ- యాభై ఏళ్ళొచ్చాక నెలకోసారికంటే తినకూడదు. ఈ నెల్లో ఇప్పటికే రెండుసార్లు తిన్నావు" సిన్సియర్‌గా బతిమాలాను.

"ఇక తినన్లే- రోజూ నువ్వు పెట్టే గడ్డి తినలేక చస్తున్నాను. నువ్వు హాయిగా అక్కడ చికెన్ బిర్యాని తింటుంటే-"

రెహమాన్ పళ్ళు కొరుక్కుంటుంటే నేను నవ్వుతూ వంట ముగించాను.

***

సాయంత్రం ఆరింటికి డిపార్ట్‌మెంట్

మీటింగు పూర్తయ్యేవరకూ నాకు మళ్ళీ గాయత్రి మాటే గుర్తు రాలేదు.

"మీ కోసం కారు వచ్చిందంట మేడం" అని అటెండరు బాలయ్య చెబుతుంటే ఔనుగదా అనుకున్నాను.

అనుకోకుండా నా చీరె వంక చూసుకున్నాను. హోప్‌లెస్- చీరె కట్టుకునేటపుడు గాయత్రి గుర్తొస్తే కాస్త మంచి చీరన్నా కట్టుకునేదాన్ని. వేసవికాలం మెత్తగా పల్చగా ఉంటుందని పాత నూలుచీరె తెల్లనిది కట్టుకున్నాను. అది కాస్త సాయంకాలానికి నలిగిపోయింది. సరే- నేనేంటో పూర్తిగా తెలిస్తే నన్నా నాకు phone చెయ్యకుండా ఉంటుందనే ఆలోచనతో చీరె గురించి అసంతృప్తి పడకుండా వెళ్ళి బుద్ధిగా కారెక్కాను.

ట్రాఫిక్ దాటుకుని జూబ్లి హిల్స్‌లో గాయత్రి ఇంటికి చేరే సరికి ఏడుంపావు అయింది.

గాయత్రి నవ్వుతూ ఎదురొచ్చింది. గాయత్రి చామనచాయతో ఉంటుంది. కళగల ముఖం. చక్కని పలువరస. నవ్వితే బుగ్గలు సొట్టపడి అందంగా ఉంటుంది. ముక్కుకున్న వజ్రపు పుడకతో పోటీపడే నవ్వు ఆమెది.

వాళ్ళిల్లు ఎంత విశాలంగా వైభవంగా ఉంటుందని నేనూహించుకున్నానో అంతకంటే చాలా విశాలంగా వైభవంగా ఉంది.

కొన్ని విషయాలు ఊహలకు అందవు.

చల్లని పళ్ళరసం ఇచ్చింది. అది తాగగానే అలసటంతా చేత్తో తీసేసినట్టు పోయింది. అది అలసట పోగొట్టే రసమట.

ఇంక వెన్నెల్లో వెళ్ళి కూచుందామా అంటూ నన్ను డ్రాయింగ్ రూం పక్కనున్న తోటలోకి నడిపించింది. మూడు వైపులా మల్లె పందిరులు. వెనకవైపు పున్నాగ పూల చెట్టు పారిజాతం చెట్టు. వీటి మధ్య పాలరాయి పరిచిన విశాలమైన జాగా అక్కడ తెల్లటి పరుపులు. దిళ్ళు.

డబ్బుంటే ఇంత హాయిగా కూడా సుఖపడొచ్చా అనుకుంటూ కూచున్నాను.

"నేను పది నిమిషాలలో వస్తాను. మీరు రిలాక్స్ అవండి" అంటూ అక్కడున్న సి.డి. ప్లేయర్ ఆన్ చేసింది.

రవిశంకర్ సితార్- వెన్నెలవేళ ఆలపించే రాగమేమో. అతి మధురంగా ఉంది. పది నెలలుగా ఈ సుఖాన్నెందుకు మిస్ అయ్యానా అని దిగులు పట్టుకుంది నాకు.

***

సరిగ్గా పది నెలల క్రితం ఒక మీటింగ్‌లో కలిసింది గాయత్రి. అది ఒక వలంటరీ ఆర్గనైజేషన్‌వారు బాలికల కోసం నడిపే ప్రోగ్రాం. ఆ రోజు ఆ సంస్థ వార్షికోత్సవం. నన్ను ఉపన్యాసం ఇవ్వమని పిలిచారు. ఆ సంస్థకు డొనేషన్ ఇచ్చినందుకు గావొచ్చు గాయత్రిని ముఖ్య అతిథిగా పిల్చారు. నన్ను ఆవిడకు పరిచయం చేశారు. ఆ రోజు గాయత్రి చాలా సీరియస్‌గా ఉంది. నవ్వనుకూడా లేదు. మంచి డిజైనర్ శారీ సింపుల్‌గా కనిపించేది కట్టుకుంది. నగలూ అంతే- వి.ఐ.పి. అని ఎవరూ చెప్పకుండానే పోల్చుకోవచ్చు అంతకుమించి నేను గాయత్రి గురించి పట్టించుకోలేదు.



**చట్ట ప్రకారం ఆ వయసులో నాకు జరిగింది పెళ్ళి కాదంటాను నేను. ఆ పెళ్ళి పెళ్ళి కాదని చట్ట ప్రకారం నిరూపించవచ్చు. కానీ సెక్సు కూడా జరిగింది. అది నా సమ్మతి మీద జరిగిందా, అసమ్మతి మీద జరిగిందా అంటే నేను చెప్పలేను.**

నా ఉపన్యాసం నేను ఇచ్చుకున్నాను. నా ఉపన్యాసం బాల్య వివాహాల గురించి. బాల్య వివాహాలు కూడదనీ, ఏజ్ ఆఫ్ కన్సెంటు చట్టం గురించీ చెప్పాను. అందులో ఫూలేమనీ కేసు, రుక్మాబాయి కేసు వీటి గురించి వివరించాను. రుక్మాబాయి కేసు గురించి చెప్పటమంటే నాకు అత్యుత్సాహం. ఆ కాలంలో రుక్మాబాయి చిన్నతనంలో తన సమ్మతి లేకుండా చేసిన వివాహం తనకు అక్కర్లేదనీ, ఆ భర్తతో కాపురం చెయ్యననీ కోర్టుకి వెళ్ళింది. సమాజంలో అందరూ ఆమెను నిందించారు. బాల గంగాధర తిలక్ వంటివారు ఆడవాళ్ళు చదువుకుంటే ఇలాంటి అనర్థాలే వస్తాయన్నారు. హిందూ ధర్మాలను కాలదన్నినదానిగా ఆమెను దేశమంతా దుమ్మెత్తి పోసింది. ఐనా రుక్మాబాయి వెనుదిరగలేదు. ఆ కేసులో ఓడిపోయింది. భర్త వివాహ హక్కుని రక్షిస్తూ రుక్మాబాయిని కాపురానికి వెళ్ళమని కోర్టు ఆదేశించింది. జైలుకైనా వెళ్తాను గానీ కాపురానికి వెళ్ళనని తీర్పుని వ్యతిరేకించింది రుక్మాబాయి.

బ్రిటీష్ ప్రభుత్వాన్ని, హిందూ సమాజాన్నీ ఒకేసారి ఎదిరించిన రుక్మాబాయి ధైర్యాన్ని చెప్పటం నాకు చాలా ఇష్టం. అనర్గళంగా మాట్లాడేశాను. ఆడపిల్లల మీద జరిగే హింస గురించి టీనేజ్ ఆడపిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, సెక్స్, సైకాలజీ వీటి గురించి తెలుసుకోవాల్సిన అవసరం- ఓ- ఇవన్నీ నాకు కొట్టిన పిండి.

ఆ రోజు నేను బాగా మాట్లాడానని అందరూ మెచ్చుకున్నారు. గాయత్రి ఏమీ మాట్లాడలేదు. నమస్కారం చేసి వెళ్ళిపోయింది. తర్వాత నా ఫోన్ నంబర్ సంపాదించి నన్ను కలవాలని అడుగటం మొదలుపెట్టింది. నేను పది నెలలుగా లొంగలేదు. విశ్వేశ్వర్రావు పేరు తెలియని వాళ్ళు రాష్ట్రంలో అతి తక్కువమంది. అంత పెద్ద పారిశ్రామికవేత్త. వాళ్ళింటికి వెళ్ళి వాళ్ళ హోదా అంతస్తూ చూసి దానిని మెచ్చుకోవాలనే ఆసక్తి నాకేమాత్రం లేకపోవటం వల్ల పది నెలలుగా నేను గాయత్రి ఆహ్వానాన్ని తిరస్కరిస్తూ వస్తున్నాను. ఇవాళ చిక్కాను.

బాగుంది. హాయిగా ఉంది. వెన్నెల. మల్లెలు. మెత్తని పరుపు. మధురమైన సంగీతం. ఓ రెండు గంటలు గడిపి, మంచి భోజనం చేసి, ఇంతమంచి టేస్టున్న గాయత్రిని పొగిడి వెళ్తాను- నష్టమేమిటి?

గాయత్రితో నేను గాఢస్నేహం చెయ్యబోవటం లేదు గదా- అనుకుంటున్నంతలో గాయత్రి వచ్చింది.

"ఇవాళ ఎలాగైనా మిమ్మల్ని కలవాలనుకున్నాను" నా పక్కనే కూచుంది.

"ఎందుకు?"

"సుప్రీంకోర్టు తీర్పు చూశారు గదా. ప్రీ మారిటల్ సెక్సు నేరం కాదని. ఆ విషయం చాలా సంతోషంగా అనిపించింది. ఆ తీర్పుని సెలబ్రేట్ చేసుకోవాలనిపించింది. మీకంటె ఈ విషయాలు అర్థం చేసుకునేవాళ్ళు నాకు తెలియదు. ఆ రోజు మీ ఉపన్యాసం విన్నాను గదా- మీకు బాగా అర్థమవుతుందని- మీతో అదంతా మాట్లాడాలని".

గాయత్రి ముఖంలో సంతోషం చూస్తే నాకు ఆశ్చర్యం.

'ఈమెకు ప్రీ మారిటల్ తీర్పు మీద అంత సంతోషమేంటి?'

పెళ్ళికి ముందు అలాంటి సంబంధాలున్నాయా? ఇన్నాళ్ళూ గిల్టీ ఫీలవుతూ ఇప్పుడు అది నేరం కాదనేసరికి రిలీఫ్ వచ్చిందా? వస్తే వచ్చింది. అది నాతో చెప్పటం దేనికి. బహుశ ఒక సైకలాజికల్ అవసరం కావచ్చు. నాకంటే ఆ అవసరాన్ని ఎవరు తీరుస్తారు?

అమ్మ గాయత్రీ- చాలా తెలివైనదానివే. నీ కన్ఫెషన్‌తో ఓ డిన్నరిచ్చి నన్ను వాడుకోదల్చుకున్నావన్నమాట'.

"నాకింకా పెళ్ళి చేసుకునే అవకాశం ఉంది. ప్రీ మారిటల్ సెక్సు నేరం కాదు గాబట్టి నేనే నేరమూ చెయ్యలేదు" అంది ఉత్సాహం ఉప్పొంగుతుండగా.

నాకొక్క ముక్క అర్థం కాలేదు. పెళ్ళి చేసుకునే అవకాశం ఏంటి? విశ్వేశ్వర్రావుకి విడాకులిస్తుందా? ఇచ్చి వేరే పెళ్ళి చేసుకున్నా విశ్వేశ్వర్రావుతో జరిగింది ప్రీ మారిటల్ సెక్సెలా అవుతుంది? నా బుర్ర గందరగోళమైంది. అదంతా నా ముఖంలో కనిపించిందేమో గాయత్రి నవ్వింది. వెన్నెల్లో ఆమె పలువరుస తళుక్కున మెరిసింది.

"మీకు నా మాటలు అర్థం కాలేదు కదూ- ముందు నాకూ అర్థం కాలేదు. నెమ్మదిగా అర్థం చేసుకున్నాను. మీకు చెబుతుంటే ఇంకా బాగా తెలుస్తుందనే మిమ్మల్ని పిలిచాను".



**మా అమ్మా నాన్నా నాకు వరుడిని వెతుకుతారు. పెళ్ళిచూపుల్లో ఒకరినొకరం చూసుకుని ఇష్టపడతాం. అతను నాతో మాట్లాడతానంటాడు. నా ఇష్టాలన్నీ అతనితో చెబుతాను. పెళ్ళికి ముందే హోటళ్ళకీ సినిమాలకూ తిరుగుతాం. సినిమా హాల్లో అతనో రోజు మెల్లిగా నా చెయ్యి తన చేతిలోకి తీసుకుంటాడు. నా ఒళ్ళు ఝల్లుమంటుంది.**

గాయత్రి ముఖం సీరియస్‌గా ఆ మీటింగులో నే చూసిన ముఖంలా మారింది.

నా చిక్కుముడి ముఖం మారలేదు. గాయత్రి మెల్లగా చెబుతోంది.

"ఆ రోజు మీ ఉపన్యాసం నన్ను వెంటాడుతోంది. మీరు ఇద్దరు ఆడపిల్లల గురించి చెప్పారు. ఫూల్‌మని- పన్నెండేళ్ళకే పెళ్ళయి భర్త దౌర్జన్యానికి రక్తం చెరువై చచ్చిపోయిన పసిపిల్ల- ఎంతో దిగులేసింది. అట్లాంటి వాళ్ళిప్పుడూ ఉంటారు కదూ-" జాలిగా అడిగింది.

ఔనని తలూపాను అయోమయంగా.

గాయత్రి ఎక్కడికెళ్తుందో నాకు అంతుబట్టడం లేదు.

"రుక్మాబాయి గురించి కూడా చెప్పారు. ఆమె గురించి విన్న దగ్గర్నించీ నాకు ఆమె అంటే ఆరాధన. ఆ పాత కాలంలోనే తన కోసం తను నిలబడింది. పెద్దలకి భయపడలేదు. చివరికి జైలుకి వెళ్ళటానికి కూడా సిద్ధమయింది. ఆ రుక్మాబాయి కథను ఏడో తరగతిలోనో, ఎనిమిదో తరగతిలోనో పాఠంగా ఎందుకు పెట్టరు?" ఆవేశంగా అడిగింది.

"పెడితే ఆడపిల్లలకు ధైర్యం వస్తుంది. చాలా సంసారాలు రోడ్డుకెక్కుతాయి" నవ్వాను.


"కదా! నేనూ అదే అనుకున్నాను. ఇప్పుడు నా కథ మీకు చెప్తాను. నాకు సెక్సు అనుభవం నా పదిహేనో ఏట జరిగింది.

రెండు కుటుంబాల సాక్షిగా, సమాజం సాక్షిగా నేను విశ్వేశ్వర్రావుతో నాకంటే పన్నెండేళ్ళ పెద్దవాడితో సెక్సులో పాల్గొన్నాను" నేను షాకవుతున్నానని గమనించింది.

"పెళ్ళి జరిగింది కదా అంటారు మీరు. చట్ట ప్రకారం ఆ వయసులో నాకు జరిగింది పెళ్ళి కాదంటాను నేను. ఆ పెళ్ళి పెళ్ళి కాదని చట్ట ప్రకారం నిరూపించవచ్చు. కానీ సెక్సు కూడా జరిగింది. అది నా సమ్మతి మీద జరిగిందా, అసమ్మతి మీద జరిగిందా అంటే నేను చెప్పలేను. నేను వద్దనలేదు, అల్లరి చెయ్యలేదు గనక సమ్మతి అనుకోవాలా? సమ్మతి, అసమ్మతి తెలిపే హక్కు నాకుందని తెలియని వయసు గనుక అసమ్మతి అనుకోవచ్చా- మీ ఉపన్యాసం విన్నదగ్గర్నించీ నాలో ఇవే ఆలోచనలు".

నేను సానుభూతిగా గాయత్రి భుజం మీద చెయ్యేశాను. ఆ చెయ్యి గట్టిగా పట్టుకుంది.

"ఆ వయసులో నాకు పెళ్ళి గురించి ఆలోచనే లేదనను. చాలా కలలుండేవి. నేను ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని అనుకునే వయసు రాలేదింకా. డిగ్రీ పూర్తయ్యాక మా అమ్మా నాన్నా నాకు వరుడిని వెతుకుతారు. పెళ్ళిచూపుల్లో ఒకరినొకరం చూసుకుని ఇష్టపడతాం. అతను నాతో మాట్లాడతానంటాడు. నా ఇష్టాలన్నీ అతనితో చెబుతాను. పెళ్ళికి ముందే హోటళ్ళకీ సినిమాలకూ తిరుగుతాం. సినిమా హాల్లో అతనో రోజు మెల్లిగా నా చెయ్యి తన చేతిలోకి తీసుకుంటాడు. నా ఒళ్ళు ఝల్లుమంటుంది. ఇలా నా పదిహేనో ఏట నే చూసిన సినిమాలు నే చదివిన పుస్తకాల ఆధారంగా నా పెళ్ళి గురించి కలలు కంటూ ఉన్నాను. ఇంతలో మా నాన్న పరిశ్రమకు ఇంకో పారిశ్రామిక సంస్థతో కలవాల్సిన అవసరం వచ్చింది. రెండు ఇండస్ట్రీల కలయికకు నా ప్రీ మారిటల్ సెక్సు అవసరం అయింది- అది వాళ్ళు పెళ్ళనే



అన్నారు. కానీ చట్టరీత్యా ఆ వివాహం చెల్లదు. కదా? నేను అవివాహితను. విశ్వేశ్వర్రావుతో నాది వివాహేతర లైంగిక సంబంధం. నిజానికి నా పద్దెనిమిదోయేటి వరకూ అది నాపై జరిగిన అత్యాచారం. కాబట్టి నేనతని మీద కేసు పెట్టొచ్చు. ఆ తర్వాత మేమిద్దరం మేజర్లం కాబట్టి మా సెక్సు నేరం కాదు. ఇపుడు నేను వివాహం చేసుకోదలిస్తే నేరస్తురాలిలాగా కాకుండా ధైర్యంగా చేసుకోవచ్చు".

నేను గాయత్రి మాటలు వింటూ ఉండిపోయాను.

ఈ గాయత్రి మనసులో ఎంత కసి పేరుకుపోయిందో-

"నా పెళ్ళి గురించి, పెళ్ళి తర్వాత నా భర్తతో జరిగే మొదటి అనుభవం గురించి చాలా కలలు కన్నాను...

వీడు- ఈ విస్సిగాడు- నాకంటే 12 ఏళ్ళ పెద్ద మృగం. వాడికి సెక్సు అనుభవం చాలా ఉంది. అంతా మృగానుభవమే- నన్నో వస్తువులా వాడి అవతల పారేశాడు.

రెండేళ్ళపాటు మైనర్‌నయిన నన్ను నా కుటుంబం అనుమతితో, ఏమీ పట్టని బంధుగణాల అనుమతితో వాడు నన్ను రేప్ చేశాడు. నేను మాట్లాడలా- నాకు తెలియదు. మేజర్‌ని కాదని తెలుసుగానీ దాన్ని ఎదిరించాలని తెలియదు. ధైర్యం లేదు. ముఖ్యంగా నాకు రుక్మాబాయి గురించి తెలియదు. నా లాంటివాళ్ళు, నాకంటే బీదవాళ్ళు, ఇలాంటి అత్యాచారాలని ఎదిరించారనీ చట్టాలు లేకముందే కోర్టుకి వెళ్ళి చట్టాలు సృష్టించారని తెలియదు. తెలిస్తే నేనూ అట్లా చేసేదాన్నేమో-


ఏమయినా నా దృష్టిలో నాకు పెళ్ళి కాలేదు. సెక్సు సంబంధం ఉంది. అది ప్రీ మారిటల్ సెక్సు- కోర్టు అది నేరం కాదందని".

"గాయత్రి- కోర్టు నేరం కాదంది ఇద్దరూ అంగీకరించి వెళ్ళిన లైంగిక సంబంధాన్ని- నీ విషయంలో అది కాదు జరిగింది. నీ అంగీకారం లేదు. నీకు పెళ్ళయింది గాబట్టి అది మారిటల్ రేప్. చట్టం దృష్టిలో అదింకా నేరం కాదు".

"అందుకే నాకు పెళ్ళి కాలేదు అంటున్నాను".

"సరే ఏదో ఒకటి- ఏదేమైనా నీ జీవితంలో తేడా ఏముంటుంది? నువ్వింకో పెళ్ళి చేసుకోబోవటం లేదు గదా".

"ఏమో- చేసుకోవచ్చు. నా కలలు నాకున్నాయి. మేం కలిసి తిరుగుతాం".




"ఓహో- అప్పుడది నేరం కాదనా నీ సంతోషం-"

"అంతేకాదు- నాకు నచ్చిన మనిషిని నేను పెళ్ళాడాలనుకుంటున్నా".

"ఐతే ముందు విడాకులు తీసుకో".

నేను గాయత్రి వేస్తున్న పీటముడుల లోంచి బైటపడే ప్రయత్నం చేస్తున్నాను.

"విడాకులెందుకు? నాకు పెళ్ళే కాలేదంటుంటే-"

"అదన్నా చెబుతూ కోర్టుకి వెళ్ళాలి గదా- ఉన్నట్టుండి ఈ ఇల్లు ఒదిలి వెళ్ళి వేరే పెళ్ళి చేసుకోగలవా?"

గాయత్రి కాసేపు నిశ్శబ్దమయింది.

చుట్టూ ఆ వెన్నెల, మల్లెలు అన్నీ అర్థరహితంగా కన్పించాయి గాయత్రి కథ విన్నాక.

ఈ పై మెరుగులు, సౌకర్యాలు, విలాసాల వెనక ఎంత బీభత్సం ఉందో అర్థమై మనసంతా వికలమైంది.

"నేను కోర్టుకి వెళ్తా. మీ ఉపన్యాసం విని పది నెలలయింది. ఆలోచిస్తూ ఉన్నా. ఇవాళ్టికి తేల్చుకున్నా. సుప్రీంకోర్టు మాటలు ఏదో ట్రిగ్గర్ పాయింట్‌లా పని చేశాయి. ఇవాళనుంచీ నేను స్వేచ్ఛాజీవిని. నా జీవితం నేను కొత్తగా ప్లాన్ చేసుకుంటా. ఎంత ఉత్సాహంగా ఉన్నానంటే ఈ మాటలు ఎవరర్థం చేసుకుంటారో వాళ్ళకు చెప్పకపోతే నిలవలేననిపించింది".

గాయత్రి ముఖంలోని కాంతితో వెన్నెలకే మళ్ళీ వెలుగొచ్చినట్లయింది.

"చెప్పండి- నా నిర్ణయం కరెక్టేనా?"

"నీకు కరెక్టనిపిస్తే కరెక్టే. కానీ చాలా కష్టాలు పడాలి".

"ఏం కష్టాలండీ- రుక్మాబాయి టైమ్‌లో ఆమె పడిన కష్టాలకంటే ఎక్కువ కష్టాలైతే ఉండవు. నాకు బోలెడు ఆస్తి ఉంది. నా పేరు మీదే ఉంది".

ఇద్దరమ్మాయిలు వచ్చి అక్కడ రకరకాల పదార్థాలున్న గిన్నెలు పెట్టి వెళ్ళారు.

"మీరెళ్ళండి. మేం వడ్డించుకు తింటాం" అని వాళ్ళను పంపించేసింది. ప్లేటులో ఒక్కో వంటకమే శ్రద్ధగా పెడుతూ

"నా కేసు చాలా సులభమండి. పదిహేనేళ్ళకే అయిన పెళ్ళి చెల్లదని ఒప్పుకోవాలి. తప్పదు. కానీ 18 ఏళ్ళ వయసొచ్చిన తర్వాత ఇష్టంలేని పెళ్ళి చేసుకున్నవాళ్ళు నాకు తెలిసే ఎంతోమంది ఉన్నారండి. వాళ్ళ దృష్టిలో అది పెళ్ళి కాదు.


కానీ నోరు మూసుకున్నారు గనక, నోరెత్తే సాహసం లేదు గనక అది అత్యాచారమూ కాలేదు. ప్రీ మారిటల్ సెక్సు అసలే కాదు. అసలు సుప్రీంకోర్టు పెళ్ళంటే ఏంటో చెప్పాలండి-

అందరూ పెళ్ళయింది, పెళ్ళయింది అన్నంతమాత్రాన ఆడపిల్లలకు పద్దెనిమిదేళ్ళు నిండినాసరే జరిగేది పెళ్ళి కాదండి. పెళ్ళయిందా లేదా అన్నది ఎవరికి వాళ్ళకే తెలుస్తుందండి. అయిన పెళ్ళి ఎప్పుడు తెగిపోయిందో కూడా ఎవరికి వాళ్ళకే తెలుస్తుందండి. అది తెలిసినప్పుడు కోర్టుకెళ్ళటం అందరికీ కుదురుతుందాండి- వెళ్ళే ధైర్యం అందరికీ ఉంటుందాండీ-

అందుకే అసలు పెళ్ళంటే ఏంటో కూడా చెప్పాలండీ-

పెళ్ళి ఎప్పుడు జరుగుతుందో, బతుకుతుందో, చచ్చిపోతుందో చెప్పుకునే అవకాశం ఉండాలి. చచ్చిపోయిన మనిషి లోంచి ప్రాణం పోయినట్టు చచ్చిపోయిన పెళ్ళి లోంచి బతికున్న మనిషి బైటికి నడిచి పోగలగాలి. అంత సులువుగా ఉండేలా చెప్పాలి".

*వీడు- ఈ విస్సిగాడు- నాకంటే **12** ఏళ్ళ పెద్ద మృగం. వాడికి సెక్సు అనుభవం చాలా ఉంది. అంతా మృగానుభవమే- నన్నో వస్తువులా వాడి అవతల పారేశాడు. రెండేళ్ళపాటు మైనర్‌నయిన నన్ను నా కుటుంబం అనుమతితో, ఏమీ పట్టని బంధుగణాల అనుమతితో వాడు నన్ను రేప్ చేశాడు.*




గాయత్రికి ఎంత ఉత్సాహంగా ఉన్నా తను పూనుకున్న పనిలో ఎంత కష్టముందో కూడా తెలిసినట్టే ఉంది.

"అది తేలిక కాదు. బహుశ అసాధ్యం. వ్యక్తులు తమంత తాము అలా చెయ్యగలరేమో గానీ, సమూహాల గురించి అలాంటి మాటలు సుప్రీంకోర్టు కాదు గదా ఎంతటి అత్యున్నతమైన సంస్థ అయినా చెప్పలేదు-"

"కొందరలా చెయ్యగా చెయ్యగా సుప్రీంకోర్టుకి చెప్పే ధైర్యం వస్తుందేమోనండి".

"నీకు మాత్రం చాలా ధైర్యం వచ్చింది. Go ahead" అన్నాను నవ్వుతూ. తనూ హాయిగా నవ్వింది.

గాయత్రి పెళ్ళి పెళ్ళి అంటోంది గానీ ప్రేమ అనాలి. అదే చెప్పాను. నవ్వేసింది.

"నేనింకా ప్రేమదాకా రాలేదుగా. అందరూ అయిందనే కాని పెళ్ళి మాత్రమే నాకు తెలుసు. నా చుట్టుపక్కలంతా పెళ్ళి తప్ప ప్రేమ లేదు. కనీసం పెళ్ళయినా జరగాలి. పెళ్ళిలో బతకాలి. పెళ్ళికి కూడా చావుంటుంది. ఇది నా ఉద్దేశం. ప్రేమంటో ఏంటో తెలిశాక దాని గురించి ఆలోచిస్తా. ఇప్పుడు నా కలలన్నీ ప్రేమ గురించీ-" డ్రీమీగా నవ్వింది.

గాయత్రి నవ్వుతోంది గానీ అది విషాద కథే. గాయత్రిలా డబ్బు, తెలివి, ధైర్యం లేని వాళ్ళు ఎందరో ఆ విషాదంలో మగ్గిపోతున్నారు. ఊపిరాడక చచ్చిపోతున్నారు. గాయత్రి తలపడటానికి సిద్ధంగా ఉంది గనుక ఉత్సాహం.

"మీ సహాయం కావాలి నాకు" అంది గాయత్రి నాకు వీడ్కోలు చెబుతూ.

నేను గాయత్రిని దగ్గరకు తీసుకుని భుజం తట్టాను.

ఇంటికొచ్చి రెహమాన్‌తో గాయత్రి కథంతా చెప్పేదాకా నాకు ఊపిరాడలా. చాలాసేపు మేమిద్దరం పెళ్ళి, సెక్సు, ప్రీ మారిటల్ సెక్సు వీటి అసలర్థాల గురించి మాట్లాడుకున్నాం.

ఎవరి బలవంతమూ లేకుండా ఇష్టంతో ఇద్దరు వ్యక్తుల మధ్య సెక్సు పాపంగా, అవినీతిగా, నేరంగా మారటానికి బలవంతంతో పెళ్ళి పేరుతో సెక్సు మొదలవటానికీ బీజాలు పడిన చారిత్రక సందర్భం ఎక్కడ నుంచి మొదలై ఉంటుందో మాట్లాడుకుంటూ నిద్రపోయాం.

ముందు నాకు జరిగింది వివాహం కాదని నిరూపించాలి అనేది. అదంతా అనవసరమంటే వినిపించుకునేది కాదు. లీగల్‌గా తనకా అవకాశం ఉంది. చట్టరీత్యా గాయత్రి పెళ్ళి చెల్లదు. కానీ అలా కోర్టుకెళ్ళటానికి తన కుటుంబాన్ని అంతా బైట పడెయ్యాలి. అదంతా ఎందుకంటే వినేది కాదు. ఆరు నెలలు గడిచాయి. ఇల్లు దాదాపూ పూర్తయిపోతోంది.

***

ఆ తర్వాత గాయత్రి ఫోను కోసం నేను ఎదురుచూసేదాన్ని. గాయత్రి చాలా భావుకురాలు. చురుకైనది. నేను చదవమన్న పుస్తకాలు చదివి బాగా మాట్లాడేది. తన విషయంలో ఏం చెయ్యబోతుందో చెబుతుండేది.

విషయం పబ్లిక్ అయి కోర్టుకి వెళ్ళే ముందు తనకో ఇల్లు కట్టించుకుంటోంది.

ఆ ఇంట్లోకి వెళ్ళి తర్వాత కోర్టుకి వెళ్తానంటోంది.

కోర్టు అవసరం లేకుండా మ్యూచువల్ డైవర్స్ కోసం ప్రయత్నించమని నేను చెప్తే వినేది కాదు.

ముందు నాకు జరిగింది వివాహం కాదని నిరూపించాలి అనేది. అదంతా అనవసరమంటే వినిపించుకునేది కాదు. లీగల్‌గా తనకా అవకాశం ఉంది. చట్టరీత్యా గాయత్రి పెళ్ళి చెల్లదు. కానీ అలా కోర్టుకెళ్ళటానికి తన కుటుంబాన్ని అంతా బైట పడెయ్యాలి. అదంతా ఎందుకంటే వినేది కాదు. ఆరు నెలలు గడిచాయి. ఇల్లు దాదాపూ పూర్తయిపోతోంది. ఆ ఇంటి గురించి రోజూ ఏదో ఒక విశేషం నా చెవిలో వేస్తుండేది.

***

ఉదయాన్నే పేపర్ చదవందే మరే పనీ చెయ్యలేను. పనులు తొందరగా అవాలంటే పేపర్ త్వరగా రావాలి. పేపర్ కోసం చూస్తూ వాకిట్లో నిలబడ్డాను.

నాకు పారిజాతం పూలంటే ఇష్టమని పెద్ద తొట్టెలో పారిజాతం మొక్క పంపింది గాయత్రి. తొట్టెలో పారిజాతం చెట్టు పెంచాలనే ఆలోచన నాకు రాలేదు. మా వాకిట్లో సరిగ్గా సరిపోయిందది. ఆరు నెలల్లో అది బాగానే పెరిగింది. పూలు కూడా పూస్తోంది. ఆ పూలను కోస్తున్నా- పేపర్‌బాయ్ పేపర్ విసిరేశాడు.

పూలొకచేత్తో పేపరొక చేత్తో- అవస్థ పడుతూనే మొదటి పేజీ పూర్తిగా విప్పా-

మొదటి పేజీలో గాయత్రి బొమ్మ-

ఏంటిది- ఒక అలజడితో అక్షరాల వైపుకి వెళ్ళాను.

"ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర్రావు భార్య గాయత్రీదేవి హఠాన్మరణం (అనుమానాస్పదం)-"

పూలు చేతిలోంచి కిందపడిపోయాయి. రెండు చేతుల్తో పేపర్ గట్టిగా పట్టుకుని "రాహూ- రాహూ" అని కేక వేశాను.

అదిరిపోయిన రెహమాన్ పరిగెత్తుకు వచ్చాడు.

"గాయత్రి చచ్చిపోయింది. కాదు- చంపేశారు" అన్నాను.

నా కళ్ళల్లో నీళ్ళతో పేపర్‌లో అక్షరాలు అలుక్కుపోయాయి.

గాయత్రి చచ్చిపోయింది.

రుక్మాబాయిలా పోరాడాలనుకున్న గాయత్రిని చంపేశారు.

రుక్మాబాయికంటే తనకే పోరాడే అవకాశాలున్నాయన్న గాయత్రిని ఆ అవకాశాలే చంపేశాయి.

గాయత్రి అంత ధనవంతురాలు కాకపోతే చనిపోయేది కాదేమో. ఏమో-

స్త్రీల శీలం దానిమీద వారి తిరుగుబాటు ఏ కుల మర్యాదను, ఏ వంశ గౌరవాన్ని ఎప్పుడెలా మంటగలుపుతుందో చెప్పలేం.

ఆ మంటల్లో స్త్రీలు కాలి బూడిదవ్వాల్సిందే. ఆ రోజంతా గాయత్రి నవ్వు నా చెవుల్లో మోగి నన్ను ఏడిపిస్తూనే ఉంది. తర్వాత వచ్చిన వార్తల్లో అనుమానాస్పదం లేదు. మరణమే ఉంది. గాయత్రికి ఆమె కట్టుకున్న కొత్త ఇల్లుని సమాధిగా చేశారు. గాయత్రీ మందిరం అని పేరు పెట్టారట.

అక్కడ అనాథ బాలికలకు, స్త్రీలకు ఆశ్రయం ఇస్తారట.

అక్కడెన్ని అత్యాచారాలు జరుగుతాయో ఊహించుకుంటేనే భయంగా ఉంది.